
# తనదాకా వస్తే

—పొన్నలూరి పద్మావతి



సముద్ర స్నానానికి అల్లుడూ, కూతురుతో, భార్యా సమేతంగా వచ్చిన ఆఫీసరు ఫణిభూషణరావు, సముద్ర తీరాన వున్న బంగళాలోని ఒకరూము తమకోసం ముందుగా రిజర్వు చేయించుకుని వున్నాడు. స్నానానికి వెళ్ళేలోపల కొంచెంసేపు విశ్రాంతి తీసుకుందామని వాలు కుర్చీలో మేను వాల్చాడు.

"నాన్నా! మీరు కాసేపు రెష్టు తీసుకోండి. నేను, మీ అల్లుడుగారు వెళ్ళి స్నానం చేసి వస్తాం!" అని సముద్రం వైపు దారితీసింది—సునంద. భార్య వెంట నడిచాడు రజనీకుమార్.

ముందునాటి మానసికాందోళన వల్ల రాత్రి బాగా నిద్ర పట్టనందుచేతనేమో – సాగరపు చల్లగాలికి చిన్న కునుకు తీస్తున్నాడు ఆఫీసరు.

కొంత సేపటికి సునంద, హృదయ విదారకంగా ఏడుస్తూ తండ్రి గదిలోకొచ్చి కుప్ప కూలిపోయింది. తృళ్ళిపడి లేచిన భూషణానికి విషయం అర్థం గాక అయోమయంగా చూస్తున్నాడు.

"బాబయ్యా! అమ్మగారితో తానం చేస్తున్న బాబుగారు ఏ సుడిగుండాల్లో చిక్కుకుపోయిండ్రో! బయటికి రాలేదయ్యా!" అన్నాడు ఆమెతో వచ్చిన పల్లె పాపయ్య.

"మా అల్లుణ్ణి రక్షించండయ్యా–రక్షించండి!" అంటూ గావుకేకలు పెట్టాడు—వెర్రివాడిలా ఆఫీసరు.

"ఈ దినం రేవుల్లో దిగితే పెమాదమని, రేడియోలో చెప్పింఁడ్రుగదయ్యా! మీరెట్టా తానాల కొచ్చిండ్రు? ఈపాటికి పడవలేసుకుని సముద్రాన దిగేవాళ్ళం. ఆడ పుట్ట పురుగు లేకపోతే మీకెట్టా తెలీలేదంటా!" రెట్టించి అన్నాడు ఆ జాలరి.

"ఎట్లాగైనా మా అల్లుణ్ణి కాపాడండయ్యా! డబ్బెంతయినా ఇస్తాం!" ఆవేదనగా బ్రతిమాలుకుంది-ఆఫీసరు భార్య అనసూయమ్మ.

"మా ఎత్తు బంగారం ఇత్తామన్నా ఈయాళ సముద్రంలోకి వోరూ దిగరమ్మా! ఏ ఎదవన్నా డబ్బుకాశపడి ప్రాణాలకు తెగించి, దిగినా, దొరికితే శవమే దొరుకుద్ది. ఏం లాబం?" వివరంగా చెప్పాడు పాపయ్య.

ఇహ చేసేదేమిలేక తిరుగు ప్రయాణం కట్టేడు ఆఫీసరు. సరదాగా స్నానాలు చేసి, సాయంకాలం దాకా సర్వేచెట్ల మధ్య, ఇసుక తిన్నెలపైన కేరింతలు కొడుతూ తిరిగే అల్లుణ్ణీ, కూతుర్నీ మురిసిపోతూ చూసుకోవాలనుకున్న అనసూయమ్మ దంపతులకు బండెడు దుఃఖం మిగిలింది. భర్తను కోల్పోయిన శోకదేవత అయిన కూతుర్ని ఇంటికి తీసికెళ్ళడం ఎంతో బాధాకరంగా వుంది.

ఆనంద సాగరంలో తేలిపోవాలనుకున్న వారు విచార సముద్రంలో మునిగి ఇల్లు చేరేరు.

*

దుఃఖాతిరేకంతోనేమో – సునంద చైతన్య రహితంగా పడివుంది, మూడు సంవత్సరాల మనమరాలు రోజీ తండ్రికోసం మారాం చేస్తోంది.

"ఇంకెక్కడి నాన్న తల్లీ! సముద్రానికి ధార బోసి వచ్చేమే! అమ్మా! అందర్నీ నట్టేట్లో ముంచి మాయమయ్యాడే తల్లీ!" అని శోకాలు పెడుతూ మనమరాల్ని కౌగలించుకుని వెక్కి–వెక్కి ఏడ్చింది అనసూయమ్మ.

ఎప్పుడూ చిర్నవ్వుతో కళకళలాడుతూ తిరిగే సునంద శోకతప్తంగా, అచేతనంగా పడి వుండేసరికి ఆఫీసరుకు పిచ్చిపట్టినట్లుగా వుంది.

"అమ్మా సునందా! లేతల్లీ! లేచి కాస్త కాఫీ అయినా తీసుకోమ్మా! మాకోసం, నీ పాపకోసమైనా నీవు బావుండాలి తల్లీ! నీ మృదువైన హృదయమే నిన్ను చల్లగా కాపాడుతుందనుకునేవాణ్ణమ్మా! కానీ–కానీ చీమకైనా ద్రోహం చెయ్యని నీకు భగవంతుడు ఎంత అన్యాయం చేసేడమ్మా! పదికాలాలపాటు పచ్చగా వుండాల్సిన నీ జీవితం పాతికేళ్ళకే ముగుస్తుందనుకోలేదు....తల్లీ అనుకోలేదు!" విచారం గొంతులో సుళ్ళు తిరగ్గా మాట పెగల్లేదు భూషణంగారికి. కూతురు ముఖం తన చేతుల్లోకి తీసుకుని, భోరున ఏడవసాగాడాయన.

"నాన్నా! నాకు ధైర్యం చెప్పాల్సిన వాళ్ళు మీరే ఇంతగా దుఃఖిస్తే ఎలా నాన్నా! నేను పూర్వ జన్మలో ఎంతో పాపం చేసేను. నాకెవరిదో వుసురు తగిలింది." అంటూ తండ్రి వడిలో తల దాచుకుంది.

సునంద అంటున్న ఒక్కొక్క మాట ఆయన గుండెల్లో గుచ్చుకుంటూంది. ఏవో జ్ఞాపకాలు వెన్నును పొడుస్తున్నాయి. అయినా తను నిబ్బరం తెచ్చుకుని, కూతుర్ని వోదారుస్తున్నాడు.

"ఎల్లకాలం దీన్ని మోడుగా ఇంట్లో పెట్టుకుని బొట్టులేని ముఖం చూస్తూ ఎట్లా బ్రతుకుతామండీ! తల్లీ. బిడ్డను ఏం పెట్టి పోషిస్తామండీ! అయ్యో ఎంత ఘోరం జరిగిపోయిందండి!" పొంగి వచ్చే ఏడ్పును ఆపుకోడానికి ప్రయత్నిస్తూ, పమిట చెరుగు నోట్లో తురుముకుంది అనసూయమ్మ.

"పిచ్చిదానా! దాన్ని మనం పోషించేదేమిటే! గర్నమెంటు ఫేమిలీ బెనిఫిట్ ఫండు ఇస్తుంది. డిపాజిట్ డబ్బు, ప్రావిడెంటు ఫండు, యల్ ఐసిలో రావలసినది—అవీ ఇవీ కలిసి బోలెడు డబ్బు వస్తుంది. చదువుకుంది గనుక వుద్యోగం ఇస్తారు. ఫేమిలీ పెన్షన్ వస్తుంది. ఎటొచ్చి చనిపోయిన భర్తను, పసుపు కుంకుమలను తెచ్చివ్వలేము!" ఒక్కక్షణం భర్తవియోగశోకంలో వున్న సునంద తండ్రినని మరిచిపోయి, అతనిలో వున్న ఆఫీసరు మేల్కొని జి. ఓ. లు ఏకరువు పెట్టాడు.

"శవాన్ని ఎవరైనా చూడనిది ఆతడు మరణించాడంటే ఏలా నమ్ముతుందండి ప్రభుత్వం? దానికి రావలసిన డబ్బుతో సుఖపడేరాత కూడా లేకుండా, అర్ధాంతరపు చావు తెచ్చిపెట్టాడు గదండీ?" కన్నీళ్ళొత్తుకుంటూ రుద్ధ కంఠంతో అంది అనసూయమ్మ.

"అవునవును" అంటూ వెళ్ళి ఈజీచెయిర్‌లో వాలాడు భూషణంగారు.

వర్తమానపు బాధ నధిగమించి, భవిష్యత్తు మీదికి వెళ్ళేయి ఆయన ఆలోచనలు. సునంద భవిష్యత్తు భీకరాట్టహాసంతో భయపెడుతోంది.

ఆర్థిక స్థోమత, సంపాదన లేని వితంతువు, ఎంత విధేయతగా అన్ని పనులు సమకూర్చిపెడుతున్నా, అన్నివిధాల విలువలేనిదే. అన్నదమ్ముల అసహనం, వదినా మరదళ్ళ దెప్పుడు మాటలు, అత్తగారింట్లో కూడా అంతకంటే అనాదరణ, పితృప్రేమకు నోచుకోని పిల్లల పరితాపం, అచ్చట ముచ్చట జరపలేక, జరగనందుకు సంతానాన్ని చూచి తల్లులుపడే ఆవేదన. భగవాన్! పగవారికి కూడా వద్దు-ఈ బాధ. సునంద భవితవ్యం గురించి వూహించినంత మాత్రాన్నే భరించలేక పోతున్నాడతడు.

తన సునంద అనాధగా, విధవరాలుగా వుండరాదు. ప్రయత్నిస్తే ఎన్నోవిధాల అనుకూల వాతావరణం ఏర్పరచవచ్చు. రూల్సులో పరిస్థితినిబట్టి సడలింపదగిన జి.ఓ.లు వుంటాయేమో! చూడాలి. సునందకు గవర్నమెంటు నుంచి చెందవలసిన డబ్బు రాబట్టాలి.

అలా ఆలోచనా ప్రవంతిలో కొట్టుకులాడుతున్న ఆఫీసరుకు గోడ గడియారం ఏడు గంటలు కొట్టడం వినిపించింది. ఆ గంటలు తన గుండెల మీద సమ్మెట పోట్లలా వున్నాయి.

నిన్న ఇదే సమయంలో మూర్తీభవించిన శోకదేవతలా, వైధవ్యానికి ప్రతీకలా తెల్లని చీరతో, వాడిన వదనంతో పాతికేళ్ళు కూడా నిండని శకుంతల ఇద్దరు పిల్లలతో తన రూములోకి ప్రవేశించింది. తోడుగా తన శ్రీమతిని కూడా వెంటబెట్టుకుని వచ్చింది. తను ఎవరి తాలూకు మనిషి అయిందీ చెప్పుకుంది. తన ప్రస్తుత పరిస్థితి సవిస్తరంగా వివరించింది. కాని, కాని తనేం చెయ్యగలిగాడు? జాలిపడడం మినహా. ఏలాంటి హామీ కూడా ఇవ్వలేకపోయాడు. ఎందుకని? పరిస్థితి అలాంటిది. వుద్యోగధర్మం పాటించవలసినప్పుడు కఠినులు గాక తప్పదు గనక-తను కసాయివాడికంటే హీనుడైనాడు ఆ సమయాన.

*

శకుంతల భర్త సుదర్శనం ఎల్. డి. సి. క్లర్కు. సిటీలో తనకేదో పనుందని, ఫ్యాన్‌కు బదులు తను అకౌంటు తీసికెళ్ళాడు. మరునాడు శలవు గనక, వంటి దురదకు సముద్రస్నానం మంచిదని ఎవరో చెప్పిన విషయం గుర్తుకువచ్చి, ఆఫీసులో తను సముద్ర స్నానానికి వెళ్ళుతున్నట్టు ఎవరితోనో చెప్పాడు సుదర్శనం.

ఆకాశం బాగా మబ్బులు కమ్మి వుంది. ప్యాంటు, స్లేకు విప్పి వొడ్డునపెట్టి సముద్రంలోకి దిగాడు సుదర్శనం. వుధృతంగా లేస్తున్న అలలను లక్ష్యపెట్టక ముందుకు సాగాడు. దూరం నుంచి ఓ జాలరి చూచి హడావుడిగా పరుగెత్తుకొచ్చాడు. ఆనాడు బంగాళాఖాతంలో సుడిగుండం పడిందని, తుఫాను సూచనలున్నాయని, జాలర్లని రేవుల్లో దిగవద్దని రేడియో కేంద్రం హెచ్చరించినందువల్ల, ఎవరూ సముద్రం ఛాయలకు రాలేదు. అతడు పరుగెత్తుకుని వచ్చేసరికే, పెద్ద పెద్ద కెరటాలు వుధృతంగా లేచి, సుదర్శనాన్ని లోపలికి లాక్కుపోయాయి. సుదర్శనం అదృశ్యమైనాడు. తన దగ్గర వల గాని, మరే పరికరంగాని లేనందువల్ల చూచిన అతను సముద్రంలో దిగలేదు.

సుదర్శనం అకౌంటు అందినట్లు సంతకం చేయించుకోడానికి రాకపోయేసరికి అతగాణ్ణి గురించి ఆఫీసరు అడిగాడు. సముద్ర స్నానానికి వెళుతున్నట్టు తెలిసిందన్నారు. . ఆనాటి వాతావరణం చూస్తుంటే స్నానానికి అనువైనదిగా లేనందువల్ల, స్నానాల రేవుకు వెళ్ళి కనుక్కొన్నారు — అతని పరిచయస్తులెవరో. సుదర్శనం విప్పి వుంచిన స్లేకు, ప్యాంటు తెచ్చిచ్చి, జరిగిన సంగతి చెప్పాడు జాలరి నాగన్న.

సుదర్శనం సంగతి వాళ్ళ ఆఫీసుకు ఫోన్ చేసి చెప్పారు. విషయం తెలియగానే సుదర్శనం తండ్రి సుందరయ్య టౌనుకు వచ్చి, సముద్రం దగ్గరకు పోయి వాకబు చేసేడు. ఎన్నివేల రూపాయలు ఖర్చయినా సముద్రమంతా గాలించి, తన కొడుకు శవాన్నైనా చూపించమని కంటికీ మింటికీ ఏకధారగా ఏడుస్తూ బ్రతిమాలుకున్నాడు సుందరయ్య.

ఎక్కడన్నా ఇసకలో కూరుకుపోయివున్నా, సొరచేపలు ఇప్పటికి తినేసే వుంటాయని; మరో రేవుకన్నా కొట్టుకుపోతే పుట్టకో, గుట్టకో తగుల్కొని, చీకిపోయి, ఎముకలు మాత్రమే మిగిలి వుంటాయని, వెతికే ప్రయోజనం లేదనీ. అనవసరంగా, డబ్బు ఖర్చు చెయ్యడం ఎందుకని నచ్చజెప్పారు జాలర్లు.

పుట్టెడు దుఃఖాన్ని మోసుకుని పుత్రవియోగంతో ఇల్లు చేరాడు సుందరయ్య.

హిందూ ధర్మప్రకారం సుదర్శనానికి ఖర్మకాండలు జరిపించాడు సుందరయ్య. శవాన్ని చూడలేదు గనక, భర్త బ్రతికి వుంటాడేమోననే భ్రమ కలిగినా, చెట్టంత కొడుకు పోయి ఖర్మ చేస్తున్న మామగారికంటె, తను వితంతువు కావడం గొప్ప కాదని వైధవ్యానికి తల వొగ్గింది శకుంతల.

*

కొంత హడావుడి తగ్గి, కాస్త వుపశమనం పొందిన తరువాత శకుంతలకు డిపార్టుమెంటు నుంచి చెందవలసిన డబ్బుకోసం ఆమె చేత అర్జీ పెట్టించాడు సుందరయ్య. శకుంతలకు రావలసిన డబ్బు శాంక్షన్ అయ్యేనాటికి, ఆఫీసరు సన్నిహితులూ, సుదర్శనానికి వ్యతిరేకులు అయిన కొందరి ద్వారా సుదర్శనం బ్రతికే వున్నట్టు, అప్పుడప్పుడూ చాటుగా ఇంటికెళ్ళి మాట్లాడి మళ్ళీ మాయమవుతున్నట్టుగా, విశ్వాసపాత్రమైన సమాచారాలు

అందుతున్నాయి ఆఫీసరుకు.

తను పూర్తిగా నమ్మినా, నమ్మకపోయినా, తన మీదికి నేరం రాకుండా, సుదర్శనం చనిపోయినట్టు గట్టి ఆధారాలు లేవు కాబట్టి, ఆ సంగతి స్పష్టంగా తేలేవరకు శకుంతలకు అందవలసిన డబ్బు, తగిన సౌకర్యాలు కలగచెయ్యడం విరమించవలసినట్లు హెడ్డాఫీసుకు రిపోర్టు పంపాడు ఫణిభూషణంగారు. ఆఫీసువర్కు స్ట్రిక్టుగా చేస్తున్నాననే సంతృప్తి మిగిలింది అతడికి.

అతడు పైకి వ్రాసిన రిపోర్టువల్ల ఫైలు పెండింగులో పెట్టి వుంచిన కారణాన శకుంతలకు ఏలాంటి సహాయం అందలేదు. సుదర్శనం బ్రతికి వున్నట్టు వదంతి ఒకటి బయలుదేరినట్టు శకుంతల కుటుంబ సభ్యుల చెవికి అందింది.

సుదర్శనం మేనల్లుడు కూడా అతడి పోలికతోనే వుంటాడు. ఇటీవల వుద్యోగరీత్యా ప్రక్కవూరికి ట్రాన్స్‌ఫర్ అయివచ్చాడు. అప్పుడప్పుడు తాత గారింటికి వస్తుంటాడు. అతగాణ్ణి చూచి, సుదర్శనం అని అనుమానించారేమోనని ఆఫీసరు దగ్గరకు ఇతణ్ణి పిలుచుకువెళ్ళి చూపించాడు సుందరయ్య.

ఇది కూడా ఒక ప్లానే అయివుంటుందని, వారికి అనుకూలంగా త్రిప్పి వ్రాసి పంపలేదు ఆఫీసరు.

*

రోజులు జరిగిపోతున్నాయి. కాని, శకుంతల చేతికి డబ్బు అందలేదు. ఆఫీసులో కనుక్కున్నప్పు డల్లా, ఇంకా ఏదో ఎంక్వయిరీలు చేస్తున్నామని, అవి ఎంత త్వరగా తేలితే అంత త్వరగా సహాయం చేస్తామనీ చెపుతున్నారు.

సంవత్సరీకాలు కూడా జరిపారు. ఆఫీసులో ముఖ్యమైనవారిని పిలిచి భోజనాలు కూడా పెట్టించారు.

వారంతా జాలి, సానుభూతి కురిపించారు గాని, డిపార్టుమెంటల్‌గా సహాయం మాత్రం చెయ్యలేకపోయారు.

కొన్ని రోజులకు సుదర్శనం బ్రతికి వున్నట్టు గట్టి ఆధారాలు లేకపోతే, శకుంతలకు డిపార్టుమెంటు నుంచి డబ్బు ఇతర సౌకర్యాలు అందవలసినట్లు ఆర్డర్ వచ్చినట్టుగా, విశ్వాసపాత్రుల ద్వారా సమాచారం అందింది సుందరయ్యకు. ఆఫీసరుతో మాట్లాడాడు సుందరయ్య. తగిన సమాధానం అందలేదు. తను వాళ్ళింటికెళ్ళి బ్రతిమాలుకుంటానంది శకుంతల.

"ఆడవాళ్ళు ఆఫీసరుగారింటికి వెళితే, పని జరగడం ఎట్లావున్నా అపనిందలు వస్తాయమ్మా!" అన్నాడు సుందరయ్య - ఆమె వెళ్ళడానికి సమ్మతించక.

మామగారు పల్లెకు వెళ్ళిన సమయం చూచి, ఆఫీసరుగారింటికి వెళ్ళి, అనసూయమ్మతో అన్ని విషయాలు చెప్పింది.

"మరునాడు వచ్చి ఆయనగారితోనే నేరుగా చెప్పు"మని సలహా ఇచ్చింది - అనసూయమ్మ. ఆమె చెప్పినప్రకారం వచ్చింది శకుంతల. నిన్నటి విషయాలన్నీ క్షుణ్ణంగా గుర్తుకు తెచ్చుకుంటున్నాడు ఆఫీసరు.

"మీ ఆఫీసులో పని చేస్తూ చనిపోయిన సుదర్శనం భార్యటండీ ఈమె!" భర్తకు పరిచయం చేసింది అనసూయమ్మ.

విచారానికి ప్రతీకలా వున్న ఆమె ముఖం చూస్తుంటే భర్త బతికి వుండీ డబ్బుకోసం నాటక మాడుతున్న వంచకిలా కనపడ్డం లేదు. ఓ అబలకు తనవల్ల అన్యాయం జరుగుతున్నదేమో – అని అంతరాత్మ ఘోషిస్తోంది. అయినా అది తను చెయ్యవలసిన సొంత పని కాదు; ఆఫీసు వర్కు. ఏలాగో బుకాయించి పంపకపోతే, తను కనికరంతో ఏదో సహాయం చేకూర్చే పనిచేసి, తన నెత్తి మీదికి తెచ్చుకునేలా వున్నాడు అని మనసులోనే తలపోసి, హృదయాన్ని పాషాణం చేసుకున్నాడు.

"అలా కూర్చోమ్మా!" కుర్చీవైపు చెయ్యి చూపాడు భూషణంగారు. క్రింద పరిచి వున్న తివాసీ మీద కూర్చుంది శకుంతల. "సార్! హెడ్డాఫీసు నుంచి మీకు కాగితాలు వచ్చాయని తెలిసింది. ఈసారైనా హెల్పు చెయ్యండి సార్! ఇప్పటికే ఎంతో ఇబ్బందిపడి పోతున్నాము. పుత్ర శోకంతో క్రుంగిపోతున్న మామగారు, మా ముగ్గుర్ని ఎల్లకాలం ఎలా పోషించగలరు? అసలే అప్పులవాళ్ళు ఆయన ప్రాణాలు తోడేస్తున్నారు, అప్పులిచ్చే కొట్లల్లో, వారు బ్రతికుండగా మరి కొన్ని వస్తువులు ఎక్కువగా తీసికెళ్ళమని అంటగట్టేవాళ్ళు. ఇప్పుడు పాత అప్పు కట్టండి, నయాపైసాకైనా అప్పు ఇవ్వం అంటున్నారు."

## మహాభాష్యం పేరిందేవి



హైద్రాబాదు రేడియోలో కర్ణాటక సంగీత కార్యక్రమాలు ప్రారంభమైన తొలి దినాలలోనే అంటే– 1949 సంవత్సరంలోనే ఆ సంగీత కార్యక్రమాలలో ప్రముఖ సంగీత విద్వాంసురాలు శ్రీమతి మహాభాష్యం పేరిందేవి తరచుగా పాల్గొంటూ వుండేవారు.

పేరిందేవికి చిన్న వయసులోనే సంగీతాభిలాష కలిగింది. ఏడవఏటనే హార్మోనియం అభ్యసిస్తూ తన సోదరితో పాటుగా వర్ణాలు, కీర్తనలు ఏడాది లోపునే నేర్వగలిగారు. ఆనాటి పల్లెటూర్లలో జానపదులు పాడే కీర్తనలను పేరిందేవి ఎక్కువగా అనుకరించి నేర్చుకున్నారు. వివాహానంతరం ఆమె 1938 లో హైద్రాబాదు చేరుకున్నారు. అప్పటికే ఆమె స్వయంకృషితో ఫిడేలు, వీణ వాద్యాలు నేర్చుకున్నారు. వాటికి తోడుగా చక్కటి గాత్రం జత కూడడంతో ఆమె ఆనాటి ఆంధ్రయువతీ మండలి వారి పద్యపఠన పోటీలో పాల్గొని మొదటి బహుమతి నందుకున్నారు. ఆ తరువాత చాలాకాలం పాటు అక్కడి వార్షికోత్సవాలలోని సంగీత కార్యక్రమాలు ఆమె ఆధ్వర్యంలోనే జరిగాయి.

భర్త ఉద్యోగరీత్యా పేరిందేవి 1959 లో ఢిల్లీ చేరుకున్నారు. అక్కడ వున్న తొమ్మిదేళ్ళ లోనూ రేడియోలో సంగీత కచేరీలు చేయడమే కాకుండా అప్పటి రాష్ట్రపతి రాధాకృష్ణన్ వంటి ప్రముఖుల సమక్షంలో కచేరీలు చేసి ప్రశంసలందుకున్నారు. ఢిల్లీలో జరిగే శ్రీరామనవమి ఉత్సవాలలో తన కుమార్తె కాంతతో కూడా సంగీత కార్యక్రమాలలో ఆమె పాల్గొనేవారు. ఆమె కుమారుడు శ్రీ చిత్తరంజన్ హైద్రాబాదు ఆకాశవాణి కేంద్రంలో నిలయ విద్వాంసుడుగా వుంటున్నారు.

1960లో స్వామి శివానంద చేతుల మీదుగా 'సంగీత రత్నాకర' బిరుదు పొందిన పేరిందేవి స్వయంకృషితో 'సంగీతవిశారద' సాధించారు. 'భగవద్గీత సార గేయమాల' (శ్రీఎన్. వి. ఎన్ ఆచార్య రచన)కు ఆమె స్వరకల్పన చేశారు.

—ఆర్. రాజ్యలక్ష్మి

అంటూ అతిదీనంగా తన బాధ వెళ్ళబోసుకుంది శకుంతల.

"మీరెంతో బాధపడుతున్నారని గ్రహించగలనమ్మా! కాని, సుదర్శనం చనిపోయినట్టుగా రుజువు కావడానికి శవాన్ని ఎవరూ చూడలేదు. అలా టప్పుడు మీకనుకూలంగా వ్రాసి, డబ్బు శాంక్షన్ చేసి మీకిస్తే, ఒక వేళ అతడు బ్రతికున్నట్టు రుజువైతే, పైసలతో సహా లెక్కగట్టి గవర్నమెంటుకు నా డబ్బు ఇవ్వవలసి వస్తుంది. రిటైర్ అయిన తరువాత వచ్చే డబ్బు దానికి కట్టి, నేను చేతులు కడుక్కుని ఇంటికెళ్ళాల్సిందే!" కాస్త విసుగు గూడా ధ్వనించింది ఆయన స్వరాన.

"ఆయన నిజంగానే బ్రతికుంటే నాకింకేం కావాలిసార్? వార్ని తెచ్చి నాకు చూపిననాడు ఇరవై వేలు చేసే మా ఇల్లు మీ పేరిట రిజిష్టర్ చేస్తాను" ఛాలెంజి చేసింది శకుంతల. ఆమె తీక్షణమైన చూపులకు, తీవ్రమైన స్వరానికి చకితుడయ్యాడు భూషణంగారు. ఆమె గమనించకుండా సర్దుకుని కూర్చున్నాడు.

"పసుపు కుంకుమలు కోల్పోయినట్టు కలగన్నా సహించలేని హిందూవనిత, కోరి వితంతువు వేషం ధరిస్తుందా? బ్రతికున్నవారికి, ఖర్మకాండలు చేస్తారా? ఆయన చనిపోకుంటే తనను విడిచి క్షణమైన వుండలేని పిల్లల్ని నిర్దాక్షిణ్యంగా, వదిలేసి వుంటారా? సొంత భార్యా పిల్లల దగ్గరికి డబ్బుకోసం చాటుగా వచ్చి పోవలసిన ఖర్మ అతనికేం పట్టింది? నిమిష నిమిషానికి తండ్రికోసం కలవరించే పిల్లల్ని లాలించలేక, కొడుకుపోయిన దుఃఖాన్ని భరించలేక పొర్లిపొర్లి ఏడ్చే ముసలి హృదయానికి వుపశమనం కలిగించలేక, పుట్టెడు విచారాన్ని నాలోదాచుకుని, ఎలా సమర్థించుకుంటున్నానో అర్థం చేసుకోండి. ఆర్థిక, మానసిక బాధలు తొలిచేస్తుంటే బ్రతకడానికి ఇంత తిండి కావలసి అప్పులకోసం తిరగాల్సి వస్తూంది. కనీసం వుద్యోగమైనా ఇప్పించండి. సంసారం జరుపుకుంటూ పదో పరకో అప్పులకు కడుతుంటాను." రుద్ధకంఠంతో అంటూ కనులొత్తుకుంది శకుంతల.

"చనిపోయినట్టు రుజువు కానిది ఎలాంటి సహకారం అందించడానికి వీలులేదమ్మా – ఇది ఉద్యోగ ధర్మం" ఆమెవైపు చూచే సాహసం లేక తల వంచుకున్నాడు.

సహాయం చేస్తాననే హామీకూడా ఇవ్వక, ఉద్యోగ ధర్మం అంటూ తప్పించుకుంటున్న ఆఫీసరు గౌరవనీయుడనే భావన తొలిగిపోయింది. విచారం, సహనం ఒక్కసారి నశించి, ఆగ్రహం రగిలింది-ఆమె హృదయాన.

"చెప్పుడు మాటలు విని, అబద్ధాన్ని నిజంగా భావించడం వుద్యోగ ధర్మమా!-భర్తను పోగొట్టుకున్న ఆడది. తండ్రికి కరువై అల్లాడే పిల్లలు, పుత్రశోకంతో అలమటించే ముసలితండ్రి మీకు నటకులుగా కనిపిస్తున్నారా! శవాన్ని చూడకపోతే మాత్రం జీవచ్ఛవాల్లాంటి మమ్మల్ని చూస్తే అర్థం కావడం లేదా? నిర్మలమైన మనస్సుతో మానవత్వాన్ని పైకి తెచ్చుకుని, నిశితంగా నా ముఖంలోకి చూచి, గుండెలమీద చెయ్యేసుకుని మనస్సాక్షిగా చెప్పండి. నేను అభినయిస్తున్నానా! అభం శుభం తెలిని పసివాళ్ళు నటకులా? కొడుకును పోగొట్టుకుని అలమటించే సుందరయ్య మహానటుడా!....లేక....లేక నా భర్త ఆకాశంలో నటిస్తునట్టు మీకు కనిపిస్తున్నాడా? చెప్పండి. ఏ ఆధారంతో ఆయన బ్రతికున్నట్టు రుజువు చేస్తారో చెప్పండి!" అంది శకుంతల కోపావేశాలతో వూగిపోతూ. "నా నమ్మకం ప్రధానం కాదమ్మా! రికార్డులో తగిన బలం వుండాలి. నేనేం చెయ్యలేనమ్మా. ఏం చెయ్యలేను." సున్నితంగా నిరాకరించారు భూషణంగారు.

"చెయ్యగలరు. మీరనుకుంటే ఎంతయినా సహాయం చెయ్యగలరు. మొదట ఎలాటి ఆటకం కల్పించారో, అలాగే ఇప్పుడు సుదర్శనం మేనల్లుణ్ణి చూచి, ఎవరో – అతనేనని చెబితే....అప్పుడల్లా వ్రాసాను. ఇప్పుడు అతడి పోలికలో వున్న మేనల్లుణ్ణి చూశాను-అవి వ్రాయండి. అంతగా మీ మీద నేరం మోపబడి, డబ్బు మీరు కట్టవలసిన పరిస్థితి ఏర్పడితే, మీ నష్ట పరిహారంగా నా ఇల్లు మీ పేరిట తాకట్టు పెట్టిస్తాను. ఈలోపల వుద్యోగం ఇస్తే పిల్లల్ని, ముసలాయన్ని పోషించుకుంటాను. మీకు అన్యాయం జరిగితే ఇల్లు మీకు దక్కుతుంది. మాకు అన్యాయం జరిగితే ప్రపంచలో మాకు చోటు లేదనుకుని కట్ట కట్టుకుని నూతిలో దూకి చస్తాం!" బాధా ప్రాధేయత పెనవేసుకున్నాయి, శకుంతల గొంతున.

శకుంతల ఆవేదన చూస్తుంటే చలించి పోతున్నాడు కాని, సహాయం చేస్తానని చెప్పడానికి సాహసించ లేకపోతున్నాడు-ఆఫీసరు.

"శాంతించమ్మా! ఒకవేళ మీ అదృష్టం బావుండి, చట్టాలు సవరించబడితే...."

"ఆపండి భూషణంగారూ! చట్టాలట, ఏం చట్టాలు? చనిపోయిన మనిషిని బ్రతికించి తేగలదా చట్టం? మరణించినట్టు నిరూపణ చెయ్యడం మా వంతయినప్పుడు, బ్రతికి వున్నట్టు రుజువు చెయ్యడం మీ వంతుకదా! అన్యాయం చెయ్యడానికి కాదు. మీ చెల్లెలికో కూతురికో ఇలాంటి ఆపద వస్తే ఇలాగే నీతులు వల్లిస్తారా? సహాయం చెయ్యడానికి అవకాశం వుండి కూడా నన్ను ఇంత ఏడిపిస్తున్నారు. నా ఉసురు మీకు తప్పక కొట్టి తీరుతుంది.....మనిషి ఎప్పుడైనా చస్తాడు. బ్రతికి వుండేది మంచితనం మాత్రమే. కష్టాలు రాకుండా గడిచి బ్రతికే వాళ్ళుండరు. గుర్తుంచుకోండి! ఆఫీసరుగారు....గుర్తుంచుకోండి!" అని పిల్లల్ని చెరో రెక్క పట్టుకుని చకచక మెట్లు దిగుతున్న శకుంతలని చూస్తుంటే నిర్విణ్ణుడయిన ఆఫీసరుకు నోట మాట రాలేదు. – పరాభవాగ్నిలో చండీ రూపం దాల్చిన అనాటి కణ్ణకి, ద్రౌపదిలాంటి వారెందరో గుర్తుకు వచ్చారు భూషణంగారికి.

జాలువారుతున్న కన్నీటిని అద్దుకుంటున్న సునంద, నిప్పులు కురిపించే కళ్ళతో చూస్తున్న శ్రీమతి అతని కళ్ళబడ్డారు.

జాత్యాభిమానంతో, స్త్రీ సహజమైన కనికరంతో, తననొక నరరూప రాక్షసుడిగా తలస్తున్నట్టు గ్రహించాడు. కాని, తన నిగ్రహాన్ని సడలించలేదు. ఆమెకు అనుకూలంగా రెకమెండ్ చేస్తూ వ్రాసి పైకి పంపించమని తల్లీ, కూతురూ శతవిధాల బ్రతిమాలుకున్నారు.

మొదట తను తెల్పిన అభ్యంతరాన్ని, తనే కాదని రాస్తే చెప్పుడుమాటల కోరుగా, తెలివి తక్కువ దద్దమ్మగా చిత్రించబడతాడని, తన ప్రిస్టేజి దెబ్బ తింటుందని గనక అలా వ్రాయలేనని ఖచ్చితంగా చెప్పాడు.

నిన్నటిరోజు శకుంతల పలికిన ప్రతిపదం పదే పదే జ్ఞప్తికి వచ్చి, కలవర పెడుతోంది.

*

సునందను చూస్తున్న ప్రతిక్షణం శకుంతల దీనస్థితి మదిలో మెదిలి అలజడి రేపుతోంది. అతడి అణువణువును పశ్చాత్తాపం తొలిచేస్తుంది. ఒక్క రోజులోనే అనుభవపూర్వకంగా ఆమె బాధను అర్థం చేసుకున్నాడు. అందుకే తనదాకా వస్తేగాని-తెలీదంటారు.

ఒక అమాయకురాలి జీవితం కంటే తన ప్రిస్టేజి ఎక్కువ కాదు. ఒక సంసారం అగచాట్లు

పొలుకావడానికంటే తన అవమానం ఎక్కువ కాదు. సుదర్శనం ఫైలు శకుంతలకు అనుకూలంగా శక్తివంచనలేక వ్రాసి పంపాలి అని దృఢ నిశ్చయం చేసుకున్నాడు.

విషయం తెలిసి ఆఫీసరుగార్ని పరామర్శించ డానికి ఎస్టాబ్లిష్‌మెంటు గుమస్తా, మరి కొందరు గుమస్తాలు ఆఫీసరుగారింటికి వచ్చారు. వాళ్ళు తన కుటుంబానికి తమ సంతాపం తెల్పడానికి వచ్చారనే సంగతి విస్మరించి, తను చేయదలచుకున్నది నెర వేరుద్దామనే వుద్దేశంలో వున్నందువల్లనేమో, సుదర్శనం ఫైలు ఇంటికి తెమ్మని చెప్పారు వాళ్ళతో.

హఠాత్తుగా అల్లుడు చనిపోయేసరికి ఆఫీసరు గారికి మతి చలించిందేమోనని అనుమానం కలిగింది వాళ్ళకు.

"ఏమిటర్రా అలా బెదిరిపోయి చూస్తున్నారు? నాకు వెర్రెక్కిందనుకున్నారా? ఇప్పటికి మామూలు స్థితిలోనే వున్నాను. వెంటనే మీరు ఫైలు తేకపోతే పిచ్చెక్కేది ఖాయం" అన్నారు ఆఫీసరు.

వెంటనే ఆఫీసుకు వెళ్ళి ఫైలు తెచ్చారు గుమస్తాలు. వీలైనంత అనుకూలంగా మేటరు వ్రాసి, మరునాడు టైపు చేయించమని వారికిచ్చారు భూషణంగారు.

*

ఎంతో భారం దిగిపోయినట్లుగా తేలిగ్గా నిట్టూర్చి పడక్కుర్చీలో వాలిపోయాడు — భూషణంగారు. కొంతసేపటికి మగత నిద్రలోకి జారేరు.

"మామయ్యగారూ!" అని పిలిచే అల్లుడి కంఠస్వరం వినబడి, త్రుళ్ళిపడి లేచాడు. తను అల్లుడి ధ్యాసలోనే వుండి కునుకు తీసాడు గనక, కలలోకొచ్చాడనుకుని, అయినా మెలుకువతో వున్నట్టు రూఢీ చేసుకోడానికి, కళ్ళు నులుపుకుని వెడల్పు చేసి చూశాడు. గదినిండా లైటు వెలుగు రేఖలు అల్లుడి కళ్ళలో ఆనందజ్యోతులు వెలుగు తున్నాయి. యదార్థమని తోచగానే సంభ్రమాశ్చ ర్యాలతో ఉక్కిరి బిక్కిరయ్యారు భూషణంగారు.

"అమ్మా సునందా! అల్లుడు బ్రతికే వున్నా డమ్మా!" దాదాపు వెర్రికేక పెట్టాడు—తండ్రి.

"ఇక్కడే వున్నాను నాన్నా!" అంటూ డోర్ కర్టన్ తొలిగించుకుని, రూములో కొచ్చింది—సునంద చిరునవ్వుతో. కూతురుతో కూడా అనసూయమ్మ గదిలోకి అడుగిడింది.

## వనిత మాటల కొలువు — 68

సరైన సమాధానం:

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| వే | యి | ప | డ | గ | లు | | క్షే |
| ము | | లా | | హ్వా | | ప్ర | జ్ఞ |
| న | స్వ | యం | | ర | మా | దే | వి |
| | క | స | క | ము | | | |
| బా | | ము | ద్దు | | జై | ని | విం |
| రా | ణి | | | స | న | | న్ను |
| మా | | చ | ను | త్ర | ము | రి | ము |
| యం | ప్ర | క్రి | | ము | | క | న్ను |

పై సమాధానంతో సరిపోయే సమాధానం పంపిన వారు 40 మంది. వారు:

1. సి. సరోజ, కోనూరు 2. పి: సుబ్బలక్ష్మి. విశాఖ పట్నం 3. పి. సత్యవాణి, బొంబాయి 4. స్వర్ణకుమారి, విజయవాడ 5, కె. ఉష, కరీంనగర్ 6. కె. లక్ష్మీ కాంతం, హుబ్లి 7. డి. విజయ, వరంగల్ 8. జి. నిర్మల, వరంగల్ 9. కె. నాగమణి, శ్రీహరికోట 10. డి. వసుమతి, నెల్లూరు 11. పి. శాంతకుమారి, వేములవాడ 12. బి. భార్గవి, ఖమ్మం 13. డి. శిరీష, హైదరాబాదు 14. ఎ. సుగుణమణి, విజయనగరం 15. ఎస్. గిరిజ, సనత్‌నగర్ 16. డి. భ్రమరాంబ, కొత్త గూడెం 17. కె. రమ, మద్రాసు 18. జి. సరోజినీదేవి, అనంతపూర్ 19. పి. సావిత్రమ్మ, అనంతపూర్ 20. టి. ఎస్. గోదావరి, జమ్మలమడుగు 21. ఎమ్. సీతమ్మ, విజయవాడ 22. కె. యశోద, గుంతకల్ 23. ఆర్. పద్మాశ్రీనివాసన్, హైదరాబాదు 24. ఎమ్. భాగ్యలక్ష్మి, బెర్హంపూర్ 25. ఎ. ప్రసూన, కొత్తపేట 26. ఎ. అన్నపూర్ణ, గుంతకల్ 27. జి. రమామణి, శ్రీకాకుళం 28. కె. జి. జానకీదేవి, మహా నంది 29. కె. సరోజారాణి, శ్రీకాకుళం 30. చంద్ర రేఖ, హైదరాబాదు 31. టి. సత్యవతి, రాజగోపాల పురం 32. వి. శశికళ, హిందూపూర్ 33. కె. రామ లక్ష్మి, కొవ్వూరు 34. జె. శ్యామలాదేవి, కడప 35. బి. రామలక్ష్మి, విజయనగరం 36. ఆర్. లలిత, కాకినాడ 37. జి. సరస్వతమ్మ, శ్రీకాకుళం 38. వై. భారతి, శ్రీకాకుళం 29. వై. వి. వంశీ, శ్రీకాకుళం 40. జి. మంజులత, కడప

బహుమతి మొత్తం రూ. 150లు వీరికి సమానంగా పంచి అందజేస్తున్నాము.

"ఏమిటే! మీకేం ఆశ్చర్యంగా లేదూ! ఏదీ జరగనట్టు ప్రవర్తిస్తున్నారే!" విస్తుబోతూ అన్నాడు ఆఫీసరు.

"అవున్నాన్నా! తెర తొలిగింది. దృశ్యం మారింది!" చమత్కారంగా చెప్పింది సునంద.

"అంటే .... అంటే ఇదంతా నాటకమా! ఓహో! నాకు కనువిప్పు కలిగించడానికి ఇంత మంది అభినయించి, నన్ను ఫూల్‌ని చేసే రన్న మాట!" తన పరాభవాన్ని పరిహాసంగా మార్చు కుని నిండుగా నవ్వేడు—భూషణంగారు.

మనమరాలు వళ్ళంతా కళ్ళుచేసుకుని, తండ్రి కాళ్ళు పెనవేసుకుంటుంటే శకుంతల పిల్లలు గుర్తుకు వచ్చారు. అంతటి ఆనందం పిల్లల కందివ్వక సుదర్శనం ఎందుకు అజ్ఞాతంగా వుంటాడు. భర్తతో సుఖపడలేక వెధవ డబ్బు కోసం శకుంతల ఎందుకు నాటకమాడుతుంది? అనుకుంటుంటే ఆమె పట్ల మరింత విశ్వాసం ఏర్పడింది ఆఫీసరుగారికి.

*

చేతిలో ఏవో కాగితాలు పట్టుకుని శకుంతల ఆఫీసరు రూములోకి ప్రవేశించింది.

"శకుంతలగారూ! మీ భర్తగారి ఫైలు వీలైనంత అనుకూలంగా వ్రాసి పంపేనమ్మా!" అన్నాడు ఆదర పూర్వకంగా ఆమె వైపు చూస్తూ.

"మీ పని మీరు నెరవేర్చారు. నా మాట నేను నిలబెట్టుకుంటున్నాను. మా ఇల్లు మీకు తాకట్టు పెట్టినట్టు వ్రాయించిన స్టాంపులు ఇవిగోండి! మీ చేత్తోనే కోర్టులో దాఖలు చేయించుకోండి." అంటూ సవినయంగా ఆఫీసరు చేతికి స్టాంపులు అందించింది శకుంతల.

ఆమె అభిమానానికి విస్తుబోయి, ఓ క్షణం పాటు అచేతనంగా వుండిపోయారు ఆఫీసరుగారు.

"నా కోసం మీరంతా ఎంతో శ్రమపడ్డారు. మీ రుణం ఎన్ని జన్మలకైనా తీర్చుకోలేను." అంటూ పేరు పేరు వరసన తన కృతజ్ఞతలు తెల్పుకుంది శకుంతల.

"మీకు న్యాయం జరిగితే చాలు, మా శ్రమ దేముంది! ఫలితం దక్కితే అందరం ఆనందిస్తాం" స్నేహంగా శకుంతల భుజం నిమిరింది సునంద.

"ఒక్కరు ఎందరికో అపకారం చెయ్యగలరు—గాని వుపకారం చెయ్యాలంటే ఎందరో సహక రించాలని ఇప్పుడు బాగా అర్థమైంది." అంటూ చేతుల్లోని స్టాంపులు చించి వేశారు ఫణిభూషణంగారు.

కాగితం ముక్కలు గదంతా పరుచుకున్నాయి, సంతోషంతో అందరి ముఖాలు వికసించాయి.